02-09-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఈశ్వరుడు సర్వవ్యాపి కారు, వారు మా తండ్రి అని మీకు ఏ విధంగా నిశ్చయము ఉందో, అలాగే ఇతరులకు కూడా అర్థం చేయించి నిశ్చయం ఏర్పరచండి, ఆ తర్వాత వారి ఒపీనియన్ ను వ్రాయించుకోండి"

ప్రశ్న:- తండ్రి తమ పిల్లలను వేరెవ్వరూ అడగలేని ఏ విషయాన్ని అడుగుతారు?

జవాబు:- బాబా పిల్లలను కలుసుకున్నప్పుడు ఇలా అడుగుతారు - పిల్లలూ, మీరు ఇంతకుముందు ఎప్పుడైనా కలుసుకున్నారా? అర్థం చేసుకున్న పిల్లలెవరైతే ఉంటారో, వారు వెంటనే అంటారు - అవును బాబా, మేము 5000 సంవత్సరాల క్రితం మిమ్మల్ని కలుసుకున్నాము. ఎవరైతే అర్థం చేసుకోరో వారు తికమకపడతారు. ఇటువంటి ప్రశ్నను అడిగే తెలివి ఇంకెవ్వరికి ఉండను కూడా ఉండదు. తండ్రే మీకు మొత్తం కల్పం యొక్క రహస్యాన్ని అర్థం చేయిస్తారు.

ఓం శాంతి. ఆత్మిక పిల్లలకు అనంతమైన ఆత్మిక తండ్రి అర్థం చేయిస్తున్నారు - ఇక్కడ మీరు తండ్రి ఎదురుగా కూర్చున్నారు. ఇంటి నుండి బయలుదేరడమే ఈ ఆలోచనతో బయలుదేరుతారు - మేము శివబాబా వద్దకు వెళ్తున్నాము, వారు బ్రహ్మ రథములోకి వచ్చి మాకు స్వర్గ వారసత్వాన్ని ఇస్తున్నారు. మేము స్వర్గములో ఉండేవారము, మళ్ళీ 84 జన్మల చక్రములో తిరిగి ఇప్పుడు నరకములోకి వచ్చి పడ్డాము. ఇంకే సత్సంగములోనూ ఎవరి బుద్ధిలోనూ ఈ విషయాలు ఉండవు. మీకు తెలుసు - మేము శివబాబా వద్దకు వెళ్తున్నాము, వారు ఈ రథములోకి వచ్చి చదివిస్తారు కూడా. వారు ఆత్మలైన మనల్ని తమతో పాటు తీసుకువెళ్ళడానికి వచ్చారు. అనంతమైన తండ్రి నుండి తప్పకుండా అనంతమైన వారసత్వము లభించాలి. ఇదైతే తండ్రి అర్థం చేయించారు - నేను సర్వవ్యాపిని కాను. పంచ వికారాలే సర్వవ్యాపి. మీలో కూడా పంచ వికారాలు ఉన్నాయి, అందుకే మీరు మహా దుఃఖితులుగా అయ్యారు. ఇప్పుడు ఈశ్వరుడు సర్వవ్యాపి కారు అన్న ఒపీనియన్ ను (అభిప్రాయాన్ని) తప్పకుండా వ్రాయించాలి. పిల్లలైన మీకైతే పక్కా నిశ్చయము ఉంది - ఈశ్వరుడైన తండ్రి సర్వవ్యాపి కారు. ఆ తండ్రి సుప్రీమ్ తండ్రి, సుప్రీమ్ టీచర్ మరియు గురువు కూడా. వారు అనంతమైన సద్గతిదాత. వారే శాంతిని ఇచ్చేవారు. ఇంకెక్కడా కూడా - ఏమి లభిస్తుంది అన్న ఆలోచనను ఎవరూ చేయరు. కేవలం వెళ్ళి కర్ణరసంతో రామాయణము, గీత మొదలైనవాటిని వింటారు. కానీ బుద్ధిలో అర్థమేమీ లేదు. ఇంతకుముందు మనం పరమాత్మ సర్వవ్యాపి అని అనేవారము. ఇప్పుడు తండ్రి అర్థం చేయిస్తున్నారు, అది అసత్యము. ఇది చాలా పెద్ద గ్లాని విషయము. కావున ఈ ఒపీనియన్ ను వ్రాయించడం కూడా ఎంతో అవసరము. ఈ రోజుల్లో మీరు ఎవరితోనైతే ప్రారంభోత్సవం మొదలైనవి చేయిస్తారో, వారు ఇలా వ్రాస్తున్నారు - 'బ్రహ్మకుమారీలు మంచి పని చేస్తున్నారు, చాలా మంచి వివరణను ఇస్తున్నారు, ఈశ్వరుడిని పొందేందుకు దారిని చూపిస్తున్నారు' అని. దీని వల్ల మనుష్యుల హృదయంపై కేవలం మంచి ప్రభావం పడుతుంది కానీ ఈ ఒపీనియన్ ను మాత్రం ఎవ్వరూ వ్రాసి ఇవ్వరు, ఏమనంటే - ప్రపంచమంతటిలో ఈశ్వరుడు సర్వవ్యాపి అని మనుష్యులు ఏదైతే అంటున్నారో అది చాలా పెద్ద పొరపాటు, ఈశ్వరుడు తండ్రి, టీచర్, గురువు. ముఖ్యమైన విషయం ఒకటేమో ఇది, ఇంకొకటి ఈ ఒపీనియన్ కావాలి, అదేమిటంటే - వీరు అర్థం చేయించేదానిని బట్టి మేము అర్థం చేసుకున్నాము, గీతా భగవానుడు శ్రీకృష్ణుడు కాదు, భగవంతుడు అని మానవులను లేక దేవతలను అనరు, భగవంతుడు ఒక్కరే, వారు తండ్రి, ఆ తండ్రి ద్వారానే సుఖ-శాంతుల వారసత్వము లభిస్తుంది అన్న ఒపీనియన్ కావాలి. ఇటువంటి ఒపీనియన్ లను తీసుకోవాలి. ఇప్పుడు మీరు ఏ ఒపీనియన్ లనైతే తీసుకుంటున్నారో, అవి పనికొచ్చేవేవీ వ్రాయటం లేదు. అయితే - ఇక్కడ శిక్షణ చాలా బాగా ఇస్తున్నారు అన్నంత వరకైతే వ్రాస్తారు, కానీ ముఖ్యమైన విషయం ఎందులోనైతే మీ విజయం జరగనున్నదో అది వ్రాయించండి, అదేమిటంటే - బ్రహ్మకుమారీలు సత్యం చెప్తున్నారు, ఈశ్వరుడు సర్వవ్యాపి కాదు, వారు తండ్రి, వారే గీతా భగవానుడు, ఆ తండ్రి వచ్చి భక్తి మార్గం నుండి విడిపించి జ్ఞానాన్ని ఇస్తారు. ఈ ఒపీనియన్ ను కూడా తప్పకుండా వ్రాయించాలి - పతిత పావని నీటి గంగ కాదు, ఒక్క తండ్రే పతిత పావనుడు. ఇలాంటి-ఇలాంటి ఒపీనియన్ లను ఎప్పుడైతే వ్రాస్తారో అప్పుడే మీ విజయం జరుగుతుంది. దీనికి ఇప్పుడు ఇంకా సమయం ఉంది. ఇప్పుడు మీ సేవ ఏదైతే జరుగుతుందో, ఇంత ఖర్చు ఏదైతే జరుగుతుందో, అందులో పిల్లలైన మీరే ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. బయటివారికైతే ఏమీ తెలియదు. మీరే మీ తనువు, మనస్సు, ధనములతో ఖర్చు చేసి మీ కొరకే రాజధానిని స్థాపన చేసుకుంటారు. ఎవరు చేస్తే వారు పొందుతారు. ఎవరైతే చేయరో వారు పొందరు కూడా. కల్ప-కల్పమూ మీరే చేస్తారు, మీరే నిశ్చయబుద్ధి కలవారిగా అవుతారు. మీరు అర్థం చేసుకున్నారు, తండ్రి తండ్రి కూడా, టీచరు కూడా మరియు గీత జ్ఞానాన్ని కూడా వారు యథార్థ

రీతిగా వినిపిస్తారు. భక్తి మార్గములో గీతను వింటూ వచ్చారు కానీ రాజ్యాన్ని ఏమైనా పొందారా. ఈశ్వరీయ మతము నుండి మారి ఆసురీ మతము ఏర్పడింది. క్యారెక్టర్లు పాడైపోతూ పతితులుగా అయిపోయారు. కుంభమేళాకు ఎంతమంది మనుష్యులు కోట్ల లెక్కలో వెళ్తారు. ఎక్కడెక్కడైతే నీరు చూస్తారో అక్కడకు వెళ్ళిపోతారు. నీటి ద్వారానే పావనముగా అవుతాము అని భావిస్తారు. ఇప్పుడు నీరు అయితే అనేక చోట్ల నదుల నుండి వస్తూ ఉంటుంది. దాని ద్వారా ఎవరైనా పావనంగా అవ్వగలరా! నీటిలో స్నానం చేయడం ద్వారా మనం పతితుల నుండి పావనులుగా అయి దేవతలుగా అయిపోతామా. అలా ఎవరూ పావనులుగా అవ్వలేరని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. ఇది పొరపాటు. కావున ఈ మూడు విషయాలపై ఒపీనియన్ ను (అభిప్రాయాన్ని) తీసుకోవాలి. ఇప్పుడు కేవలం సంస్థ బాగుంది అని అంటున్నారు. కావున అనేకులలో ఏవైతే భ్రాంతులు నిండి ఉన్నాయో - బ్రహ్మాకుమారీలు మాయ చేస్తారని, ఎత్తుకుపోతారని ఏవైతే భ్రాంతులు ఉన్నాయో, ఆ ఆలోచనలన్నీ దూరమైపోతాయి ఎందుకంటే ఆ శబ్దమైతే ఎంతగానో వ్యాపించి ఉంది కదా. విదేశాల వరకూ ఆ శబ్దం వెళ్ళింది - ఇతనికి 16,108 మంది రాణులు కావాలి, అందులో 400 మంది లభించారు అని. ఎందుకంటే, ఆ సమయంలో సత్సంగానికి 400 మంది వచ్చేవారు. ఎంతోమంది విరోధించారు, ధర్నా మొదలైనవి కూడా చేసేవారు, కానీ తండ్రి ముందైతే ఎవ్వరిదీ నడవదు. ఈ ఇంద్రజాలికుడు ఎక్కడి నుండి వచ్చాడు? అని అందరూ అనేవారు. ఆ తర్వాత అద్భుతం చూడండి, బాబా కరాచీలో ఉండేవారు, గుంపు అంతా పరస్పరం కలుసుకొని తమంతట తామే పరుగు పరుగున వచ్చేసారు. తమ ఇంటి నుండి ఎలా పారిపోయారు అన్నది ఎవ్వరికీ తెలియలేదు. ఇంతమంది ఎక్కడ ఉంటారు? అన్న ఆలోచన కూడా చేయలేదు. వెంటనే ఒక బంగళాను తీసుకున్నారు. మరి ఇది ఇంద్రజాలిక విషయమే కదా. ఇప్పుడు కూడా అంటూనే ఉంటారు - వీరు ఇంద్రజాలికులు, బ్రహ్మాకుమారీల వద్దకు వెళ్తే మళ్ళీ తిరిగి రారు, వీరు స్త్రీ-పురుషులను సోదరీ-సోదరులుగా చేసేస్తారు అని అంటూ ఉంటారు. దాని వలన ఎంతోమంది రానే రారు. ఇప్పుడు మీ ప్రదర్శనీ మొదలైనవాటిని చూసిన తర్వాత, బుద్ధిలో అంతవరకు ఏ విషయాలైతే కూర్చుని ఉన్నాయో అవన్నీ దూరమైపోతాయి. కానీ బాబా ఏ ఒపీనియన్ ను అయితే కోరుతున్నారో దానిని ఎవరూ వ్రాయరు. బాబాకు ఆ ఒపీనియన్ కావాలి. గీతా భగవానుడు శ్రీకృష్ణుడు కాదు అన్నది వ్రాయాలి. మొత్తం ప్రపంచమంతా శ్రీకృష్ణ భగవానువాచ అని భావిస్తుంది, కానీ శ్రీకృష్ణుడైతే పూర్తి 84 జన్మలను తీసుకుంటారు, శివబాబా పునర్జన్మ రహితుడు. కావున ఇందులో అనేకుల ఒపీనియన్ కావాలి. గీతను వినేవారైతే లెక్కలేనంతమంది ఉన్నారు. కానీ ఇది వార్తాపత్రికల్లో కూడా పడిందని వారు తర్వాత గమనిస్తారు - గీతా భగవానుడు పరమపిత శివ పరమాత్మ, వారే తండ్రి, టీచర్, సర్వుల సద్గతిదాత, శాంతి మరియు సుఖము యొక్క వారసత్వము కేవలం వారి నుండే లభిస్తుంది అని. ఇకపోతే ఇప్పుడు మీరు కష్టపడతారు, ప్రారంభోత్సవాలు చేయిస్తారు, తద్వారా కేవలం మనుష్యుల భ్రాంతులు దూరమవుతాయి, వారికి వివరణ మంచిగా లభిస్తుంది. కానీ బాబా ఏదైతే చెప్తున్నారో ఆ ఓపీనియన్లను వారు వ్రాయాలి. ముఖ్యమైన ఒపీనియన్లు ఇవే. ఇకపోతే ఈ సంస్థ చాలా మంచిది అని కేవలం సలహా ఇస్తూ ఉంటారు, దాని వల్ల ఏమి జరుగుతుంది. అయితే, మున్ముందు ఎప్పుడైతే వినాశనం మరియు స్థాపన సమీపముగా వస్తాయో అప్పుడు మీకు ఈ ఒపీనియన్లు కూడా లభిస్తాయి. అర్థం చేసుకొని వ్రాస్తారు. ఇప్పుడు మీ వద్దకు రావడమైతే మొదలుపెట్టారు కదా. ఒక్క తండ్రి పిల్లలమైన మేమందరమూ సోదరులము అని ఇప్పుడు మీకు జ్ఞానం లభించింది. ఇది ఎవరికైనా అర్థం చేయించడం చాలా సహజము. సర్వాత్మల తండ్రి ఒక్క సుప్రీమ్ బాబాయే. వారి ద్వారా తప్పకుండా సుప్రీమ్ అనంతమైన పదవి కూడా లభించాలి. అది 5000 సంవత్సరాల క్రితం మీకు లభించింది. వారైతే కలియుగ ఆయువు లక్షల సంవత్సరాలు అని అనేస్తారు, మీరు 5000 సంవత్సరాలు అని అంటారు, ఎంత తేడా ఉంది.

తండ్రి అర్థం చేయిస్తారు, 5000 సంవత్సరాల క్రితం విశ్వములో శాంతి ఉండేది. ఈ లక్ష్యము-ఉద్దేశ్యము మీ ఎదురుగా నిలబడి ఉంది. వీరి రాజ్యములో విశ్వములో శాంతి ఉండేది. ఈ రాజధానిని మనం మళ్ళీ స్థాపన చేస్తున్నాము. మొత్తం విశ్వమంతటిలో సుఖ-శాంతులు ఉండేవి. దుఃఖము అనే మాటే ఉండేది కాదు. ఇప్పుడైతే అపారమైన దుఃఖము ఉంది. మనము ఈ సుఖ-శాంతుల రాజ్యాన్ని మన తనువు, మనస్సు, ధనముల ద్వారానే గుప్త రీతిగా స్థాపన చేస్తున్నాము. తండ్రి కూడా గుప్తమైనవారు, జ్ఞానము కూడా గుప్తమైనది, మీ పురుషార్థము కూడా గుప్తమైనది, అందుకే బాబా పాటలు, కవితలు మొదలైనవాటిని కూడా ఇష్టపడరు. అవన్నీ భక్తి మార్గము. ఇక్కడైతే మౌనంగా ఉండాలి, శాంతిగా నడుస్తూ-తిరుగుతూ తండ్రిని స్మృతి చేయాలి మరియు సృష్టి చక్రాన్ని బుద్ధిలో తిప్పాలి. ఇప్పుడు ఇది ఈ పాత ప్రపంచములో మన అంతిమ జన్మ, మళ్ళీ మనం కొత్త ప్రపంచములో మొదటి జన్మను తీసుకుంటాము. ఆత్మ పవిత్రముగా తప్పకుండా ఉండాలి. ఇప్పుడైతే ఆత్మలన్నీ పతితముగా ఉన్నాయి. మీరు ఆత్మను పవిత్రముగా చేసుకునేందుకు తండ్రితో యోగాన్ని జోడిస్తారు. తండ్రి స్వయం చెప్తారు - పిల్లలూ, దేహ సహితముగా దేహపు సర్వ

సంబంధాలను వదిలేయండి. తండ్రి కొత్త ప్రపంచాన్ని తయారుచేస్తున్నారు, దానిని స్మృతి చేసినట్లయితే మీ పాపాలు అంతమైపోతాయి. అరే, ఏ తండ్రి అయితే మీకు విశ్వ రాజ్యాధికారాన్ని ఇస్తారో, అటువంటి తండ్రిని మీరు ఎలా మర్చిపోగలరు! వారు అంటారు - పిల్లలూ, ఈ అంతిమ జన్మలో కేవలం పవిత్రముగా అవ్వండి. ఇప్పుడు ఈ మృత్యులోకపు వినాశనం ఎదురుగా నిలబడి ఉంది. ఈ వినాశనం కూడా ఖచ్చితముగా 5000 సంవత్సరాల క్రితం ఇదే విధంగా జరిగింది. ఇది స్మృతిలోకి అయితే వస్తుంది కదా. మన రాజ్యమున్నప్పుడు ఇంకే ధర్మమూ ఉండేది కాదు. బాబా వద్దకు ఎవరైనా వస్తే వారిని నేను అడుగుతాను - ఇంతకుముందు ఎప్పుడైనా కలుసుకున్నారా? కొందరు ఎవరైతే అర్థం చేసుకున్నారో వారు వెంటనే 5000 సంవత్సరాల క్రితం కలుసుకున్నాము అని అంటారు. కొత్తవారు ఎవరైనా వస్తే వారు తికమకపడతారు. బ్రాహ్మణి సరిగ్గా అర్థం చేయించలేదని బాబాకు అర్థమైపోతుంది. అప్పుడు, ఆలోచించండి అని అంటాను, అప్పుడు గుర్తుకువస్తుంది. ఈ విషయాన్ని ఇంకెవ్వరూ అడగలేరు. అడగాలి అన్న తెలివి కూడా రాదు. ఈ విషయాలను గురించి వారికేమి తెలుసు. ముున్ముందు మీ వద్దకు ఈ కులానికి చెందినవారు ఎంతోమంది వచ్చి వింటారు. ప్రపంచమైతే తప్పకుండా మారనున్నది. చక్రము యొక్క రహస్యాన్ని అయితే అర్థం చేయించారు. ఇప్పుడు కొత్త ప్రపంచములోకి వెళ్ళాలి. ఈ పాత ప్రపంచాన్ని మర్చిపోండి. తండ్రి కొత్త ఇంటిని నిర్మిస్తే బుద్ధి అందులోకి వెళ్ళిపోతుంది. పాత ఇంటిపై ఇక మమకారం ఉండదు. ఇదేమో అనంతమైన విషయము. తండ్రి కొత్త ప్రపంచమైన స్వర్గాన్ని స్థాపన చేస్తున్నారు, అందుకే ఇప్పుడు ఈ పాత ప్రపంచాన్ని చూస్తూ కూడా చూడకండి. మమకారం కొత్త ప్రపంచముతో ఉండాలి. ఈ పాత ప్రపంచముపై వైరాగ్యము ఉండాలి. వారైతే హఠయోగముతో హద్దులోని సన్యాసము చేసి అడవిలోకి వెళ్ళి కూర్చుంటారు. మీదైతే మొత్తం పాత ప్రపంచమంతటి పైనా వైరాగ్యము, ఇక్కడైతే అపారమైన దుఃఖాలున్నాయి. కొత్త సత్యయుగీ ప్రపంచములో అపారమైన సుఖాలున్నాయి కావున తప్పకుండా దానినే తలచుకుంటారు. ఇక్కడ అందరూ దుఃఖాన్ని ఇచ్చేవారే. మాత-పితలు అందరూ వికారాలలో చిక్కుకునేలా చేస్తారు. తండ్రి అంటారు, కామము మహాశత్రువు, దానిని జయించడం ద్వారానే మీరు జగజ్జీతులుగా అవుతారు. ఈ రాజయోగాన్ని తండ్రి నేర్పిస్తారు, తద్వారా మనం ఈ పదవిని పొందుతాము. మీరు ఇలా చెప్పండి - మాకు స్వప్నములో భగవంతుడు కనిపించి 'పావనంగా అయినట్లయితే స్వర్గ రాజ్యము లభిస్తుంది' అని చెప్తున్నారు, కావున ఇప్పుడు నేను ఈ ఒక్క జన్మ అపవిత్రముగా అయి నా రాజ్యాన్ని ఎందుకు పోగొట్టుకోవాలి. ఈ పవిత్రత విషయము పైనే గొడవలు జరుగుతాయి. ఈ దుశ్శాసనుడు నన్ను వివస్త్రగా చేస్తున్నాడు అని ద్రౌపది కూడా పిలిచింది. ద్రౌపదికి శ్రీకృష్ణుడు 21 చీరలను ఇచ్చినట్లుగా ఒక నాటకాన్ని కూడా చూపిస్తారు. ఇప్పుడు తండ్రి కూర్చొని అర్థం చేయిస్తున్నారు, ఎంతటి దుర్గతి జరిగింది. అపారమైన దుఃఖము ఉంది కదా. సత్యయుగములో అపారమైన సుఖము ఉండేది. అనేక అధర్మాలను వినాశనము చేసి ఒక్క సత్య ధర్మాన్ని స్థాపన చేయడానికి ఇప్పుడు నేను వచ్చాను. మీకు రాజ్య భాగ్యాన్ని ఇచ్చి వానప్రస్థములోకి వెళ్ళిపోతాను. మళ్ళీ అర్ధకల్పం ఇక నా అవసరమే ఉండదు. మీరు ఎప్పుడూ తలచుకోను కూడా తలచుకోరు. బాబా అర్థం చేయిస్తున్నారు - మీ గురించి అందరి మనస్సులో ఏవైతే తప్పుడు వైబ్రేషన్లు ఉన్నాయో అవన్నీ తొలగిపోయి సరి అవుతున్నాయి. ఇకపోతే ముఖ్యమైన విషయము, ఈ ఒపీనియన్ ను వ్రాయించండి - ఈశ్వరుడు సర్వవ్యాపి కాదు, వారు వచ్చి రాజయోగాన్ని నేర్పించారు, పతిత-పావనుడు కూడా తండ్రే, నీటి నదులు పావనంగా చేయలేవు. నీరైతే అన్ని చోట్లా ఉంటుంది. ఇప్పుడు అనంతమైన తండ్రి చెప్తున్నారు, స్వయాన్ని ఆత్మగా భావించండి. దేహ సహితముగా దేహపు సర్వ సంబంధాలనూ వదిలేయండి. ఆత్మయే ఒక శరీరాన్ని వదిలి ఇంకొక శరీరాన్ని తీసుకుంటుంది. వారు మళ్ళీ ఆత్మ నిర్లేపి అని అనేస్తారు. ఆత్మనే పరమాత్మగా భావించడం, ఇవన్నీ భక్తి మార్గపు విషయాలు. పిల్లలు అంటారు - బాబా, స్మృతి ఎలా చేయాలి? అరే, స్వయాన్ని ఆత్మగా అయితే భావిస్తారు కదా. ఆత్మ ఎంత చిన్నని బిందువు, కావున తన తండ్రి కూడా అంత చిన్నగానే ఉంటారు. వారు పునర్జన్మలలోకి రారు. బుద్ధిలో ఈ జ్ఞానము ఉంది. తండ్రి ఎందుకు గుర్తుకురారు. నడుస్తూ-తిరుగుతూ తండ్రిని స్మృతి చేయండి. పోనీ, తండ్రిది పెద్ద రూపమనే భావించండి, కానీ స్మృతి అయితే ఆ ఒక్కరినే చేయండి, అప్పుడు మీ పాపాలు అంతమవుతాయి, ఇంకే ఉపాయమూ లేదు. ఎవరైతే అర్థం చేసుకుంటారో, వారు అంటారు - బాబా, మీ స్మృతి ద్వారా మేము పావనముగా అయి పావన ప్రపంచానికి, విశ్వానికి యజమానులుగా అవుతాము, కావున మేము ఎందుకు స్మృతి చేయము? పరస్పరం ఒకరికొకరు కూడా స్మృతిని కలిగించుకోవాలి, అప్పుడు పాపాలు అంతమవుతాయి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు, గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఏ విధముగా తండ్రి మరియు జ్ఞానము గుప్తంగా ఉన్నాయో, అలాగే పురుషార్థము కూడా గుప్తముగా చేయాలి. పాటలు, కవితలు మొదలైనవాటికి బదులుగా మౌనంగా ఉండడం మంచిది. శాంతిగా నడుస్తూ-తిరుగుతూ తండ్రిని స్మృతి చేయాలి.

2. పాత ప్రపంచం మారుతోంది, అందుకే దీని నుండి మమకారాన్ని తొలగించివేయాలి, దీనిని చూస్తూ కూడా చూడకూడదు. బుద్ధిని కొత్త ప్రపంచముతో జోడించాలి.

వరదానము:- బ్రాహ్మణ జన్మ యొక్క విశేషతను న్యాచురల్ నేచర్ (సహజ స్వభావం) గా చేసుకునే సహజ పురుషార్థీ భవ

బ్రాహ్మణ జన్మ కూడా విశేషమైనది, బ్రాహ్మణ ధర్మము మరియు కర్మ కూడా విశేషమైనవి అనగా సర్వ శ్రేష్ఠమైనవి ఎందుకంటే బ్రాహ్మణులు కర్మలో సాకార బ్రహ్మాబాబాను ఫాలో చేస్తారు. కావున బ్రాహ్మణుల స్వభావము కూడా విశేషమైన స్వభావము, సాధారణ లేక మాయావీ స్వభావము బ్రాహ్మణుల స్వభావము కాదు. కేవలం ఈ స్మృతి స్వరూపములోనే ఉండండి - నేను విశేష ఆత్మను. ఈ స్వభావము ఎప్పుడైతే సహజమవుతుందో అప్పుడు తండ్రి సమానంగా అవ్వటమును సహజంగా అనుభవము చేస్తారు. స్మృతి స్వరూపుల నుండి సమర్థ స్వరూపులుగా అవుతారు - ఇదే సహజ పురుషార్థము.

స్లోగన్:- పవిత్రత మరియు శాంతి యొక్క లైట్ ను నలువైపులా వ్యాపింపజేసేవారే లైట్ హౌస్ లు.